క్లుప్తంగా

మన్‌కీబాత్ చారిత్రాత్మకం



వనపర్తి టౌన్: దేశంలోని ప్రజలతో మమేకమయ్యేందుకు భారతదేశ చరిత్రలో ప్రజలు ఊహించని రీతిలో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన మన్‌కీబాత్ కార్యక్రమం చారిత్రత్మకంగా నిలుస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యకర్త ఆంజనేయులు నివాసంలో మన్‌కీబాత్ 118వ ఎపిసోడ్‌ను పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల, యువత, ప్రజల ఆలోచన విధానాలను తెలుసుకొని, అవసరమైన మేరకు పాలనలో వాటిని అనుసరిస్తూ ప్రధాని మోదీ సరికొత్త శకానికి నాంది పలికారని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీశైలం, చిత్తారి ప్రభాకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, రాజశేఖర్‌గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

వనపర్తి టౌన్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. ఈనెల 20న అన్ని పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఎక్కడికెక్కడ ఉపాధ్యాయులు నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సీవీన్ తదితరులు పాల్గొన్నారు.

26న కొత్త ఆసరా పింఛన్లు ఇవ్వాలి



వనపర్తి రూరల్: జనవరి 26 నుంచి పేదలకు కొత్త ఆసరా పింఛన్లు, మహిళలకు రూ.2500 ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో అర్హులైన దివ్యాంగులకు, వృద్ధులు, వితంతువులు ఆసరా ఫించన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, నాయకులు లక్ష్మీనారాయణ, రాంబాబు, చిన్నకుర్మయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి



పాన్‌గల్: ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ గోవింద్ రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మాధరావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఆర్‌ఐ మహేష్, ఏఈఓ అఖిల పర్యటించి సర్వే వివరాలను సేకరించారు. మండలంలో జరుగుతున్న సర్వే తీరును ఎంపీడీఓ, తహసీల్దార్ పర్యవేక్షించారు. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ప్రకటిస్తారన్నారు.

నేడు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రాక

మదనాపురం: మండలంలో సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పర్యటిస్తున్నారని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు దుప్పల్లిలో మహబుబ్‌సుభాని దర్గాను దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం ద్వారకానగర్, శంకరమ్మపేటలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించడంతో పాటు మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. రామన్‌పాడ్‌లో డ్రోన్ ద్వారా ప్రయోగాత్మకంగా పొలంలో వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డితో పాల్గొంటారని పేర్కొన్నారు. దీనిని గమనించి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

సర్వే వేగంగా పూర్తి చేయాలి

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో చేపడుతున్న సర్వేను ఆదివారం అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. అర్హులైన రైతు కుటుంబాలకు మాత్రమే రైతు భరోసా ఇచ్చేందుకు జీపీఎస్, జియో ట్యాగింగ్ ద్వారా వ్యవసాయ యోగ్యం లేని భూములు అనగా లే అవుట్ ప్లాట్లు, ఇరిగేషన్, రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములు, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న స్థలాలు, పారిశ్రామిక స్థలాలను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఏ మాత్రం భూములు లేని ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12 వేల ఆర్థికసాయం అందించేందుకు అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే విధంగా ఇప్పటికే రూపొందించిన జాబితాను సూపర్ చెక్ చేసి.. ఎవరైనా అనర్హులు ఉంటే గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. సర్వే మొత్తం జనవరి 20 లోపు పూర్తి చేయాలని, 21 నుంచి నిర్వహించనున్న గ్రామసభలపై గ్రామాల్లో వార్డుల్లో దండోరా వేయించి ముందస్తు ప్రచారం చేయించాలని సూచించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

వేమన స్ఫూర్తి ఆదర్శనీయం



కొత్తకోటలో యోగివేమన ప్రతిమను ఊరేగిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

వనపర్తి టౌన్: ప్రాథమిక స్థాయి విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు వేమన పద్యాలు సమాజంలో చెరగని ముద్ర వేశాయని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. వేమన 373వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాగరాజు, బాలేమియా, బండలయ్య, కావలి బాలస్వామి, కృష్ణయ్య, పరమేశ్వరచారి, మాధవాచారి, రమేష్‌చారి, సత్యంచారి, గంగాధర్‌చారి, నిదర్శన్‌గౌడ్, కృపాకర్‌రెడ్డి, బీచుపల్లి తదితరులు ఉన్నారు.

కొత్తకోటలో..

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద వేదిక నిర్మించి, వేమన భగవాన్ ప్రతిమను కొలువు తీర్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వేమన భగవాన్ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి రాష్ట్ర కో చైర్మన్ పైళ్ల హరినాథ్‌రెడ్డి, తుమ్మల మధుకర్ రెడ్డి, కంకణాల రామచంద్రారెడ్డి, కంచర్ల రవీందర్‌రెడ్డి, బోకూరి మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు, మహబూబ్‌నగర్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగ్యనాయక్, నరేందర్, పురుషోత్తంరెడ్డి, శ్రేష్టి, రామచంద్రయ్య, బాలకృష్ణ, జహంగీర్, భాస్కర్‌రెడ్డి, వేణు, రాములు, మాసన్న, శేఖర్‌రెడ్డి, శివ, మంజుల, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.



వనపర్తిలో..

మిషన్‌లో పడి రైతుకు తీవ్ర గాయాలు



ఆత్మకూర్: ఆముదాల మిషన్‌లో చేయిపడి రైతుకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని తిప్పుడంపల్లి గ్రామానికి చెందిన రైతు పుల్లరి నాగన్న తన వ్యవసాయ పొలంలో కందులను సాగు చేశాడు. కోత పూర్తయిన తర్వాత ఆదివారం కూలీలతో కలిసి పొట్టు తీసే మిషన్‌లో కంది కంకులను పోస్తూ ప్రమాదవశాత్తు కుడి చెయ్యి మిషన్‌లోకి వెళ్లడంతో చెయ్యి పూర్తిగా దెబ్బతింది. విషయాన్ని గమనించిన రైతులు మిషన్‌ను ఆపి చెయ్యిని బయటికి లాగి ప్రైవేటు వాహనంలో ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం రైతు నాగన్న పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కుడి చెయ్యిని పూర్తిగా తొలగించాలని అక్కడి వైద్యులు పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వేద పరిరక్షణకు అందరూ పాటుపడాలి

ఆత్మకూర్: పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతూ వేదాలను, సనాతన సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తున్నారని వేద పరిరక్షణకు ప్రతి హిందువు పాటుపడాలని వేదపండితులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆత్మకూర్‌లో వేద శాస్త్ర పరిరక్షణ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, శ్రీవిద్యాస్తోత్రరత్నాకర, ఆర్షవిద్యానిష్ణత రాచాలపల్లి బాబుదేవిదాస్ రావు ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల 20 మంది వేద పండితులను సత్కరించారు. కామవేదం, రుక్వేదం, యజుర్వేదం, అధర్వణ వేదం ఘనపాటిలను 25 ఏళ్లుగా సత్కరించడంతో పాటు నగదు పారితోషికాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన వేద పండితులు మాట్లాడుతూ వేదాలను పరిరక్షించేందుకు హిందువులు తమ పిల్లలను వేద పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వాలు వేద పరిరక్షణకు పాటుపడాలని, వేద పండితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయావేదాలకు చెందిన ఘనపాఠులు శ్రీపాద శర్మ, అరుణ్‌కుమార్‌శర్మ, వినయ్‌శర్మ, సుధాన్షుశర్మ, వెంకటశివరామకృష్ణ, శ్రీకరదత్తశర్మ, శంతన్ రావు, వేదపండితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేదపండితులు

రేపటి నుంచి గ్రామసభలు

పాన్‌గల్: సంక్షేమ పథకాల అమలు కోసం సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల వివరాలను మంగళవారం నుంచి నిర్వహించనున్న గ్రామ సభల ద్వారా ప్రకటించి ఆమోదం తెలుపుతారని ఎంపీడీఓ గోవింద్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. 21వ తేదీన అన్నారం, అన్నారంతండా, బహుదూర్‌గూడెం, బండపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాజిపల్లి, దొండాయిపల్లి, కదిరెపాడు, శాగాపూర్‌తండా, తెల్లరాళ్లపల్లి 22వ తేదీన చింతకుంట, కిష్టాపూర్‌తండా, కొత్తపేట, మాధరావుపల్లి, మల్లాయిపల్లి, రేమద్దుల, వెంగళాయిపల్లి, 23వ తేదీన చిక్కేపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, గోప్లాపూర్, జమ్మాపూర్, మాందాపూర్, మంగళ్లపల్లి, పాన్‌గల్, రాయినిపల్లి, శాగాపూర్, 24వ తేదీన కేతేపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు దుప్పల్లిలో కందూర్ల పండుగ

- భక్తిశ్రద్ధలతో మహబూబ్ సుభానికి ఫాతేహా కార్యక్రమాలు
- వేలాదిగా తరలివస్తున్న భక్తులు

మదనాపురం: కులమతాలకు అతీతంగా మూడేళ్లకోసారి జరిగే మహబూబ్ సుభాని కందూర్ల పండుగ సోమవారం మండలంలోని దుప్పల్లిలో అత్యంత వైభవంగా జరుగనుంది. వేలాది మంది భక్తులు ఈ వేడుకకు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలోని 80 శాతం కుటుంబాలు కందూర్లు చేస్తారు. ఇప్పటికే బంధువులు, ఆడపడుచుల రాకతో గ్రామంలో నూతన శోభ సంతరించుకుంది.

ప్రతి ఇంటి నుంచి ఫాతేహాలు

ఎంతో పవిత్రంగా జరిగే ఈ కందూర్ల పండుగను గ్రామంలో కులమతాలకు అతీతంగా అందరూ చేసుకుంటారు. తమ ఇళ్లను రంగుల ముగ్గులతో అలంకరించుకొన్నారు. పోటేళ్లు, మేకపోతులు తీసుకొచ్చి మహబూబ్‌సుభాని దర్గా వద్ద సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. మాలిజ ముద్దల నైవేద్యాన్ని ఇంటి నుంచి భాజభజంత్రీలతో దర్గాకు వచ్చి పూలమాలలు, గలేఫా కప్పి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. కందూర్ల పండుగకు ప్రతి ఇంటి నుంచి రూ.50 వేల పైగా ఖర్చు చేస్తారు.



అలంకరించిన దర్గా

మా తాతల కాలం నుంచి..



మహబూబ్ సుభాని దర్గాకు మా తాతలు పునాది వేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతి మూడేళ్లకు ఓసారి పెద్ద ఎత్తున కందూర్లు చేస్తాం. ఎంతో వైభవంగా జరుగుతుంది. గత దశాబ్దాల కాలంగా ఆనవాయితీగా కొనసాగుతుంది. గ్రామంలో చాలా మంది భక్తులు ఉన్నారు.

– మల్లెపల్లి రాజవర్ధన్‌రెడ్డి, దుప్పల్లి

కుల మతాలకతీతంగా..



కులమతాల కతీతంగా కందూర్లు చేస్తారు. ప్రతి ఇంటిలో రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు దేవుడి పేరు మీద ఖర్చు పెడతారు. ఆడపిల్లలు, బంధువులను స్నేహితులను పిలుచుకొని భోజనాలు పెడుతారు. రెండు రోజులపాటు గ్రామమంతా పండుగ వాతావరణం కనిపిస్తుంది.

– అక్కల మహదేవన్‌గౌడ్, దుప్పల్లి

మొదటిగా యాదవులే..



మహబూబ్ సుభాని దర్గాకు కందూర్లు చేయడం మొట్టమొదటిగా యాదవ కులస్తులే ప్రారంభించారు. ప్రతి మూడేళ్లకోసారి మొదటిగా యాదవులు కందూర్లు చేసేవారు. కాలక్రమేణ ప్రతి కులం వారు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలోని అన్ని కులాల వారు కందూర్లు చేస్తారు.

– మహేందర్‌యాదవ్, దుప్పల్లి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖిల్లాఘనపురం గ్రామంలో సాధారణ స్తంభాల ద్వారా ఉన్న విద్యుత్ లైన్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్న టవర్ స్తంభాల పైకి మార్చే పనులు జరుగుతున్నాయన్నారు. కావున ఖిల్లాఘనపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు, దుకాణాల వారు, రైస్ మిల్లు, ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

హాజీమాలంగ్ బాబా గంధోత్సవం

అమరచింత: సయ్యద్‌షా హాజీమాలంగ్ బాబా గంధోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండలంలోని మస్తీపురం గ్రామ శివారులోని గుట్టలపై వెలసిన హాజీమాలంగ్ బాబా దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగనున్నాయి. మొదటి రోజైన ఆదివారం గంధోత్సవ కార్యక్రమం పట్టణంలోని పెద్దపీర్ల మసీదు నుంచి ప్రారంభించారు. పట్టణ పురవీధుల గుండా గంధోత్సవ ఊరేగింపు నిర్వహించి మస్తీపురంలోని దర్గా షరీఫ్‌కు తరలించి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. సోమవారం ఉర్సు సందర్భంగా భక్తులు కందూర్‌లు నిర్వహించి బాబాకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. దర్గాకు వస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని నిర్వాహకుడు ముర్షద్ మైనోద్దీన్ తెలిపారు.



23న ఈదమ్మ జాతర తైబజార్ వేలంపాట

కొల్లాపూర్: ఈదమ్మ జాతర తైబజార్ వేలం పాట ఈనెల 23 వతేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసన్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 20వ తేదీ నుంచి 22వ తేదీ సాయంకాలం వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తైబజార్ వేలం కోసం రూ.3 లక్షల డిపాజిట్‌తో పాటు ఈఎండీ కింద రూ.10 వేలు చెల్లించాలని కోరారు. వేలం దక్కిన వారు 23 వతేదీ సాయంకాలం 5 గంటల లోగా పూర్తి డబ్బులు చెల్లించాలన్నారు.

నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకుందాం

అమరచింత: కోల్పోయిన నియోజకవర్గాన్ని సమిష్టిగా ఉంటూ తిరిగి సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఆసన్నమైందని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆదివారం అమరచింత నియోజకవర్గ సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అమరచింత నియోజకవర్గాన్ని కోల్పోవడం జరిగిందనే కారణాలను చూపకుండా.. ప్రస్తుతం 2026లో డీలిమిటేషన్ ద్వారా కొత్త నియోజకవర్గాల ఏర్పాటుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని దీంతో నియోజకవర్గ ప్రతిపాదన కోసం ప్రజాప్రతినిధులు కలిసి నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. అమరచింత నియోజకవర్గం కాకముందు నుంచే సంస్థానంగా విరాజిల్లిందని, అలాంటి అమరచింత ఉనికిని కాపాడుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణను కలిసి వినతిపత్రాలు అందిద్దామన్నారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సాధించుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా సీఎం, మంత్రులతో కలిసి వెళ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు మంగలావణ్య, సింధు, రాజ్‌కుమార్, నాయకులు నరసింహులు గౌడ్, రాజన్న, మహంకాళీ శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, శ్యాంసుందర్, మేర్వరాజు, భాస్కర్, అడ్వకేట్ రాజేందర్, ఆర్‌ఎన్ శంకర్, తెలుగు తిరుమలేష్, ఉప్పరి తిరుమలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేశాయి ప్రకాష్‌రెడ్డి

‘వర్గీకరణను అడ్డుకుంటే సహించబోం’

ఆత్మకూర్: దళితుల ఏ, బీ, సీ, డీ వర్గీకరణను అడ్డుకుంటే సహించబోమని, ప్రతిదాడులకు సైతం సిద్ధంగా ఉన్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అజ్జపాగ లక్ష్మణ్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎనుముల సోంబాబు అన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిని అరెస్టు చేయాలంటూ శనివారం సీఐ శివకుమార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేస్తున్నారని, ఇది జీర్ణించుకోలేక మాలమహానాడు నాయకులు మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ సాధించుకునేందుకు ఇలాంటి ఎన్ని అడ్డంకులు సృష్టించినా మందకృష్ణ నేతృత్వంలో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాసన్న, కట్టెల మండిరాజు, డాక్టర్ కృష్ణ, రేవల్లి శ్రీను, జానకీరాములు, ఎనుముల కిషోర్ తదితరులు ఉన్నారు.



సీఐ శివకుమార్‌కి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పాన్‌గల్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాల్గో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ కోరారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో మహాసభల వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలో ప్రజలు, కూలీలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శేఖర్‌యాదవ్, చిన్నయ్య, సీఐటీయూ నాయకులు నాగయ్య, బాబునాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనాపురం: సీపీఐఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకట్రాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన సంగారెడ్డి జిల్లాలో సీపీఐఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, చెన్నయ్య, మణివర్ధన్, వెంకటేష్, మొగిలి, హమాలీలు, నాగరాజు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

ప్రార్థనాలయాలు శాంతికి చిహ్నాలు

ఆత్మకూర్: ప్రార్థనాలయాలు శాంతికి చిహ్నాలని, ప్రతి ఒక్కరూ ప్రతినిత్యం సమయం కేటాయించి ప్రార్థనాలయాలకు వెళ్లాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ఎంబీ యేరుషలేం చర్చి 40వ వార్షికోత్సవాన్ని పాస్టర్ సుమన్, కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ నిబంధనలు పాటిసూ.. ప్రేమ, అనురాగాలతో కలిసి మెలసి జీవించాలని, ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని, ఈర్ష్యా, అసూయ, ఇతర చెడుమార్గాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, ఆర్థికంగా సహకరించాలన్నారు. దేశంలో కులమతాల చిచ్చులు రేపుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని పెపొందిస్తూ పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.

రూ.5 లక్షలు మంజూరు

ఖానాపూర్‌లో ఎంబీ యేరుషలేం చర్చి అభివృద్ధి కోసం మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి నిధుల ద్వారా రూ.5 లక్షలు నిధులు మంజూరైనట్లు కేశం నాగరాజుగౌడ్ ప్రకటించారు. చర్చి కంపౌండ్‌ను తన సొంత నిధులతో బండలను వేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రేమయ్య, వేణుగోపాల్, బాబు, రవీందర్, ఏలియా, భగవంతు, దేవరాజు, వంశీ, శ్రీకాంత్, రాజు, గోపాల్, క్రైస్తవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ప్రకృతివనం ధ్వంసం చేయడం హేయమైన చర్య

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాన్ని కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో కొందరు వ్యక్తులు పల్లె ప్రకృతివనంలోని సుమారు 120 చెట్లను కొట్టివేశారు. విషయం తెలుసుకున్న వారు గ్రామానికి వచ్చి కొట్టివేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూమిని గుర్తించి రెండు, మూడు గుంటల నుంచి ఎకరం పొలంలో పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేశారన్నారు. వనంలో ఇప్పుడు చెట్లు పెద్ద ఎత్తు పెరిగి ఆహ్లాదకరంగా మారాయన్నారు. గ్రామానికి మంజూరైన పంచాయతీ భవనం నిర్మిస్తామంటూ గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు మండల నాయకుల సలహాలతో చెట్లు నరకడం పద్ధతి కాదన్నారు. ఈ భవనాన్ని నిర్మించడానికి అవసరమైన స్థలాన్ని గ్రామస్తులు చూపుతున్నా అక్కడే చెట్లను కొట్టివేసి నిర్మిస్తామనడంపై అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ, కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామంలోని కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు గ్రామంలోని ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, అక్కడ గ్రామ పంచాయతీ భవనం నిర్మాంచాలని కోరారు.



ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పోలీసులకు ఫిర్యాదు

మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో ధ్వంసమైన పల్లె ప్రకృతి వనాన్ని ఎంపీడీఓ వెంకటాచారి ఆదివారం పరిశీలించారు వచ్చి నిలిపి వేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజుకు సూచించారు. అక్కడి వెళ్లిన కార్యదర్శి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, అందుబాటులోకి రాలేదని ఎంపీడీఓ తెలిపారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన సూచనల మేరకు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో చెట్లు కొట్టివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎఫ్‌ఐఆర్ కాపీని తీసుకొని సోమవారం కలెక్టర్‌కు అందిస్తామన్నారు.